క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే



కేటీఆర్‌తో అనిల్ జాదవ్, భూక్యా జాన్సన్ నాయక్

నేరడిగొండ: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు పేర్కొన్నారు.

‘సురవరం’ సేవలు మరువలేనివి

ఇచ్చోడ: సీపీఐ పార్టీకి సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సురవరం సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ కోసం సురవరం అహర్నిషలు కృషి చేస్తూనే ప్రజ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేశారన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రకళ, సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

‘వికాసం పాఠశాల దివ్యాంగులకు వరం’

ఉట్నూర్‌రూరల్: వికాసం ఆశ్రమం పాఠశాల ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు వరమని అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బ్యాట్మింటన్ కోచ్ కబీర్‌దాస్ అన్నారు. మంగళవారం స్థానిక వికాసం ఆశ్రమం పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆయనను జిల్లా గిరిజన క్రీడాధికారి పార్థసారథి, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వికాస్, పీడీ జలపతి, ఆర్చరీ శిక్షకులు అశోక్ ఘనంగా సన్మానించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బోథ్: పట్టణంలోని శ్రీ సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను పురస్కరించుకుని సాయిబాబా ఉత్సవమూర్తితో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథ్, సంతోష్, రాజు, రామకాంత్ రాయ్, అరవింద్, శ్రీధర్, వీరేశం, బోనగిరి రాజు, మారుతి, హన్మాండ్లు, రాజ శేఖర్, శ్రీను, రమేశ్ ఉన్నారు.

‘ఏజెన్సీ ప్రాంతాల్లో బెల్టుషాపులు ధ్వంసం చేస్తాం’

ఆదిలాబాద్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతాలలో, గిరిజన గూడేలల్లో బెల్టుషాపులు పెడితే ధ్వంసం చేస్తామని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సానేరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని, అక్రమ కేసులను ఖండిస్తూ సెప్టెంబర్ 10న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కుమ్రం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజుల, మడావి భీంరావు తదితరులు ఉన్నారు.

28న క్రీడాదినోత్సవం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 28న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఉట్నూర్ ఐబి చౌరస్తా వద్ద క్రీడా దినోత్సవ పరుగును ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ప్రారంభిస్తారన్నారు.

‘పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం’



మాట్లాడుతున్న అడ్డి బోజారెడ్డి

భీంపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

బతుకులు మారేదెన్నడో..!

- మత్స్యకారులకు అందని సంక్షేమ పథకాలు
- నిలిచిన వలలు, తెప్పల పంపిణీ
- ఆదుకోవాలని వేడుకోలు





సాత్నాల ప్రాజెక్ట్ (ఫైల్)

సాత్నాల: ఏళ్లు గడుస్తున్నా మత్స్యకారుల జీవన విధానంలో మార్పులు రావడం లేదు. చెరువులు, వాగులు, వంకలపై ఆధారపడి జీవించే మత్స్యకారులు, తమ కష్టాన్ని, చెమటను చిందించి చేపల వేట కొనసాగిస్తున్నారు. సాత్నాల పరీవాహక ప్రాంతాలు మెడిగూడ ఆర్, రామాయి, మాంగుర్ల, సుందరగిరి, జామ్ని, మార్గుడా గ్రామాల్లోని 500 కుటుంబాలకు చేపల వేటే జీవనాధారం. వీరికి వ్యవసాయ భూములు లేకపోవడంతో లైసెన్స్‌డ్ మత్స్యకారులు చేపలు పట్టి, వాటిని విక్రయిస్తూ కుటుంబాలను సాకుతున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, బీమా పథకాలు చాలా వరకు వీరికి చేరడం లేదు. వలలు, పడవలకు సరైన పరిహారం రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రకృతిలో మార్పులు, వాతావరణ ప్రభావాలు, మత్స్య సంపద తగ్గిపోవడం కూడా వీరి భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తుంది. మత్స్యకారుల సమస్యలు తీరాలంటే ప్రభుత్వం నుంచి మరిన్ని పథకాలు, ఆర్థిక సహాయం, శిక్షణ సదుపాయాలు, ఆధునిక వలల సరఫరా వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

బరువు పెరగక..

ప్రభుత్వం అందించే చేప పిల్లలు సరైన సమయంలో అందించకపోవడంతో చేపలు సరిగ్గా బరువు పెరగడం లేదు. వ్యయప్రయాసలకోర్చి చేపలు పట్టినా విక్రయానికి మార్కెట్ లేకపోవడంతో సరైన ధర రాక, జిల్లా కేంద్రానికి వచ్చి విక్రయించాలంటే రవాణా భారమవుతోందని వాపోతున్నారు. తమకు వ్యవసాయ భూములు లేవని, చేపల వేట మీదనే కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం..

ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు మత్స్యకారులకు అందేలా కృషి చేస్తాం. వలలు, తెప్పల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

– భాస్కర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

మేలు రకాలు పెంచుతాం..



ప్రభుత్వం టెండర్ నిర్వహించి చేపలు అందించే బదులు, కాంట్రాక్టర్‌కు ఇచ్చే డబ్బులు మాకే అందిస్తే మేలి రకాల చేపలు పెంచుతాం. మాకు అధిక లాభం తెచ్చే కట్ల చాపలు, మెరిగ, సిల్వర్ కప్పు, గ్లాస్ కప్పు వంటి చేప జాతులు పెంచుతాం. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.

– భవనే గంగారం, మత్స్యకారుడు

సకాలంలో అందించాలి



సరైన సమయంలో ప్రభుత్వం చేప పిల్లలను అందించడం లేదు. అంగుళం స్నర చేప పిల్లలు ఇవ్వడంతో అందులో చాలా వరకు చనిపోతున్నాయి. అవి పెరగటానికి కూడా చాలా సమయం పడుతుంది. 4 లేదా 5 అంగుళాలు ఉన్న చేప పిల్లలని పంపిణీ చేస్తే త్వరగా వృద్ధి చెంది లాభదాయకంగా ఉంటుంది.

– చుండుల నరేశ్, మత్స్యకారుడు

చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలి..



గత వారంలో కురిసిన వర్షాలకు, వలలు, తెప్పలు కొట్టుకుపోయాయి. సాత్నాల ప్రాజెక్టు వద్ద చేపల మార్కెట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు లేక మా బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– డోకే సంతోష్, మత్స్యకారుడు

రావయ్య.. గణపయ్య..!



బ్యాండు భాజాలతో తరలుతున్న వినాయకుడు

ఆదిలాబాద్: వినాయకుని ఆగమనానికి అంతా సిద్ధమైంది. వాడవాడనా గణనాయకుడిని కొలువు తీర్చేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితి పురస్కరించుకొని బుధవారం లంబోదరుడిని ప్రతిష్ఠించేందుకు ఆయా మండపాలను ఇప్పటికే సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ రూపాల్లోని పార్వతీ తనయుడి ప్రతిమలను జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు మంగళవారం తరలించారు.



వినాయకుడిని తీసుకెళ్తున్న వృద్ధుడు

మట్టి గణపతుల తయారీ



ఆదిలాబాద్‌టౌన్: మట్టి విగ్రహాలతో సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్/ ఇచ్చోడ/ఆదిలాబాద్ /తాంసి/ బోథ్/ నేరడిగొండ/ తలమడుగు: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సంగీత ఆధ్వర్యంలో, ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు సిద్ధం చేశారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, తాంసి ఉన్నత పాఠశాల, సొనాల మండల కేంద్రంలోని పాఠశాలల్లో, నేరడిగొండ జెడ్పీహెచ్ఎస్ తేజాపూర్‌లో, తలమడుగు జెడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులు మట్టితో గణేశుడి విగ్రహాలను తయారు చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్, టీచర్స్ కాలనీల్లో మట్టి వినాయక ప్రతిమలను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఉచితంగా పంపిణీ చేశా రు.

బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు



బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు, ఆటో

తాంసి: జిల్లా కేంద్రం నుంచి పొచ్చెర, బండల్ నాగాపూర్ గ్రామాల మీదుగా కప్పర్ల గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు రోడ్డు పనుల్లో భాగంగా మట్టిని పోసి అలాగే వదిలేశాడు. దీంతో వర్షాలకు వర్షపునీరు రోడ్డుపై నిలిచి బురదగా మారుతోంది. మంగళవారం వడూర్, అర్లి గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు కప్పర్ల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన బురదలో కూరుకుపోగా అప్రమత్తమైన డ్రైవర్ బస్సును అలాగే నిలిపివేశాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో పాటు పక్కనే ఒక ఆటో సైతం బురదలో కూరుకుపోయింది. అనంతరం స్థానికుల సహకారంతో బస్సు, ఆటోను బయటకు తీశారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మౌనిష్ రెడ్డి

జైనథ్: మండలంలోని కరింజ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామస్తులు మునిష్ రెడ్డి, బిక్కిగంగన్న, జగదీష్ రెడ్డి, దర్శనల అశోక్, నగేశ్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ప్లేట్లు పంపిణీ

బోథ్: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బాలికలు), బోథ్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎస్సై శ్రీసాయి మంగళవారం ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన సీఐ వెంకటేశ్వర్లు చేతులమీదుగా అందజేశారు. ఉపాధ్యాయులు అనసూయ, సతీశ్‌కుమార్, సవిత, నవ్యశ్రీ,, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పూలాజీబాబా జయంతి పోస్టర్ విడుదల

కైలాస్‌నగర్: ఆధ్యాత్మిక గురువు సిద్ధయోగ మహాపీఠాధిపతి పట్నాపూర్‌కి చెందిన పరమహంస సద్గురు పూలాజీబాబా 101వ జయంతి మహోత్సవానికి తరలిరావాలని సిద్దేశ్వర సంస్థాన్ కార్యవర్గ సభ్యులు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. అనంతరం జయంతి పోస్టర్ ఆవిష్కరించారు.

‘లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలి’

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్ర అన్నారు. మంగళవారం ప్రభుత్వ డైట్ కళాశాలలో మహిళ సమానత్వ దినోత్సవం సందర్భంగా మిషన్‌శక్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద, కృష్ణవేణి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఉట్నూర్‌రూరల్: ఇటీవల మండలంలోని రాజుల మడుగు గ్రామానికి చెందిన మృతుడు లక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. అడవి పంది దాడిలో కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి మంగళవారం ఫారెస్ట్ అధికారులతో కలిసి రూ. 10 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు.

బాలల హక్కుల కమిషనర్‌కు ఆహ్వానం

ఆదిలాబాద్: రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ కొత్తకోట సీతను జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్ బద్దం పురుషోత్తం రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి బాలల హక్కుల పరిరక్షణ దత్తత, బాలల విద్య, ఎన్జీవోల పాత్రపై చర్చించారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ విషయమై జిల్లాకు రావాలని ఆహ్వానించారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు

సాత్నాల: అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో స్రవంతి అన్నారు. భోరజ్ మండలం తర్షం వాగులో ఇసుక తవ్వకాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవసరమయ్యే ఇసుక కోసం డీడీలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, మైనింగ్ ఏడీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యతనివ్వాలి

ఆదిలాబాద్: స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యతనివ్వాలని స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత యువ ప్రముఖ్ డాక్టర్ రాహుల్ కుమార్ అన్నారు. మంచ్ ఆధ్వర్యంలో మేడ్ ఇన్ ఇండియా వస్తువులను వాడాలని స్వదేశీ సురక్ష ఔర్ స్వావలంబన్ అభియాన్ ర్యాలీని మంగళవారం ప్రారంభించారు. మంచ్ ప్రతినిధులు నాగేందర్, మహేశ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నిఖిల్, సిద్ధు, సాయి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం

తలమడుగు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లు చేరిన బాధితులకు సుంకిడి ఉన్నత పాఠశాల ఆవరణలో బాల వికాస కేంద్రం ఆధ్వర్యంలో సమన్వయకర్త ప్రసూన్ రెడ్డి, ఉపాధ్యాయులు నిత్యావసర సరుకులు, షెల్టర్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహాగర్జన సన్నాహక సభ విజయవంతం చేయాలి

ఇచ్చోడ: సెప్టెంబర్ 2న మండల కేంద్రంలో నిర్వహించే మహాగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ కోరారు. మంగళవారం ఇచ్చోడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 9న పెరేడ్ గ్రౌండ్ హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో మహాగర్జన సభ ఉంటుందన్నారు. నాయకులు సుభాష్, ఎర్రన్న, చంద్రశేఖర్, సురేశ్, పోశెట్టి, రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విత్తన గణపతి అందజేత

ఇచ్చోడ: జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు మంగళవారం ముఖరా బి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ విత్తన గణపతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపెల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విత్తన గణపతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

స్ట్రీట్ లైట్ల ఏర్పాటు

జైనథ్ : మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సహకారంతో మంగళవారం ఐరన్ పోల్ స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి 10 ఐరన్ పోల్స్‌ను ఎమ్మెల్యే అందించినట్లు తెలిపారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ప్రతాప్ యాదవ్, నాయకులు బిక్కి సంతోష్, చిన్నన్న, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

బోథ్: గణేశ్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపాలను విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.

బేల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాల సభ్యులు సూచనలు పాటించాలని సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో హిందు, ముస్లిం యువకులతో పాటు గ్రామ పెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు.

పురాణం పరిపూర్ణం..

సిరికొండ: మండల కేంద్రంలో శ్రావణమాసం పురస్కరించుకుని శివాలయంలో నెల రోజుల నుంచి కొనసాగుతున్న శ్రీరామ విజయ పురాణం మంగళవారం పరిపూర్ణంగా పరిసమాప్తమైంది. నెల నుంచి ప్రతీరోజు రాత్రి శ్రీ రామ విజయ పురాణ గాథను పండితులు వినిపించారు.

అక్షరాస్యత శాతం పెంచాలి

భీంపూర్: నవభారత్ సాక్షర విద్య కార్యక్రమం ద్వారా వయోజనులకు చదవడం, రాయటం నేర్పి అక్షరాస్యత శాతం పెంచే దిశగా కృషి చేయాలని మాస్టర్ ట్రైనర్ మహేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఐకేపీలోని వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ బాలాజీ, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

‘సంక్షేమ పథకాలను ఓర్వడం లేదు’

సిరికొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మంగళవారం ప్రెస్‌మీట్‌లో మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు యూరియా వాటా ఇవ్వకుండా పంటలు ఎండేలా చేస్తుందని విమర్శించారు. లక్ష్మణ్, రఘురాం, అనిల్, మాధవ్‌రావు, రంజాన్, భా రిక్‌రావు, షాఫి, జైనుల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేల పరిహారం చెల్లించాలి

బోథ్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ బోథ్ మండల కార్యదర్శి ఎల్.నరేశ్ డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతీ ఎకరానికి రూ.20వేల పరిహారం అందించాలని మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

‘గ్రంథాలయాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం’

బోథ్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మొదటిసారిగా బోథ్ పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ బోథ్‌లో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

వైద్యం అందక దూడ మృతి

బోథ్: పశువులకు సరైన సమయంలో వైద్యం అందక సొనాల మండల కేంద్రంలో ఒక దూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు యోగేశ్వర్‌కు చెందిన గేదె మంగళవారం ప్రసవించి దూడకు జన్మనిచ్చింది. గ్రామంలో వెటర్నరీ ఆసుపత్రి ఉన్నా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు అందక పుట్టిన దూడ వెంటనే మృతి చెందింది.

శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

ఆదిలాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

సాయి వృద్ధాశ్రమంలో అన్నదానం

తలమడుగు: జిల్లా కేంద్రంలోని హరి ఓం కాలానికి చెందిన మేస్త్రం సుభాష్ కుటుంబ సభ్యులు మండలంలో లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు.

లో, హైఓల్టేజీలతో ఇబ్బందులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్, ముత్యంపేట, శివాజీ మార్కెట్, గాంధీనగర్ కాలనీల్లో మంగళవారం రాత్రి లోఓల్టేజ్, హైఓల్టేజీల విద్యుత్ సరఫరా కావడంతో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ బల్బులు, కూలర్లు షాట్ సర్క్యూట్‌కు గురై కాలిపోయాయి. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

ఇంద్రవెల్లి: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని వికలాంగుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ ఆరోపించారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలన్నారు.

బోథ్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, హామీ ప్రకారం పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగులు మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ కుమార్, రవి, భారత వికలాంగుల సమితి అధ్యక్షుడు జక్కుల నారాయణ, కైపెల్లి శంకర్, చిత్రు తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ హయాంలోనే పొలాలకు రోడ్డు’

బోథ్: మండలంలోని రైతుల సౌకర్యార్థం, ‘పనుల జాతర’లో భాగంగా బోథ్ శివారులో కొత్తగా రెండు పొలం బాట రోడ్ల నిర్మాణ పనులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌లు మంగళవారం ప్రారంభించారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు

సాత్నాల: భోరజ్ మండల కేంద్రంలో అనుమతి లేకుండా ధర్నా నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్టి అశోక్ రెడ్డితో పాటు మరో 8మంది నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సైబర్ క్రైంపై జాగ్రత్తగా ఉండాలి

బజార్‌హత్నూర్: మొబైల్ ఫోన్‌లు వినియోగించే వారు అనుచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని, ఏపీకే ఫైల్స్ లింక్‌ను ఓపెన్ చేయవద్దని సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. మంగళవారం చందునాయక్ తాండ గ్రామంలో సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సై శ్రీసాయికి వినతిపత్రం సమర్పించారు. రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్యవాణి, హెల్త్‌అసిస్టెంట్ రమేశ్, ఏఎన్ఎం విజయ, ఉపాధ్యాయుడు లింగారెడ్డి, ఆశ సీతాబాయి పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో మండల వైద్య సిబ్బంది మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ సూచించారు. మండల విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.